## ఇంటి గోడ కూలి మహిళ మృతి



కూలిన గోడ.. మృతురాలు లింగమ్మ (ఫైల్)

**పుల్కల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వర్షానికి తడిసి పోయిన ఇంటి గోడ కూలి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోచారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన చాకలి లింగమ్మ ఇల్లు ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పూర్తిగా తడిసిపోయింది. కుటుంబ సభ్యుల వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లిపోగా ఇంట్లో లింగమ్మ పనులు చేసుకుంటోంది. వర్షాలకు కూలిన గోడలు లింగమ్మపై పడిపోవడంతో గమనించి చుట్టుపక్కల వారు 108కు సమాచారం అందించగా 108 సంఘటన స్థలానికి చేరుకుని లింగమ్మను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ లింగమ్మ మృతిచెందింది. తహసీల్దార్ ఇంటిని పరిశీలించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## నేడు, రేపు వినాయక నిమజ్జనం .. పటిష్టమైన బందోబస్తు : సిపి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో ఈనెల 16,17వ తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గణేష్ నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తునట్లు సీపీ డా॥అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గణేష్ శోభాయాత్రలో డిజె వినియోగం, బాణాసంచా వాడకంపై నిషేధం విధించినట్లు తెలిపారు. శాంతియుత ప్రశాంతమైన వాతావరణంలో అంగరంగవైభవంగా వినాయక శోభాయాత్ర నిర్వహించుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమ టిచెరువు, ఎర్రచెరువు, గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరవు, ప్రజ్ఞాపూర్‌లో ఊరచెరువు, దుబ్బాక రామ సముద్రం చెరువు,హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు,చేర్యాల కుడి చెరువుల ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర ప్రదేశాలతో పాటు నిమజ్జనం చేసే చెరువుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినా యక మండపాలను జియో ట్యాగింగ్ చేయడం జరిగిందన్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ డైవర్షన్ పా యింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె వివరించారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## నిమజ్జనంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దు

**రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త**

వినాయక నిమజ్జనం సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని,విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఆదివారం రోజున హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,కన్సిలర్లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జనం సమయంలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, లైటింగ్,బోటింగ్ సిస్టం, భారీ క్రేన్‌లు,నిమజ్జనం సమయంలో చెరువు వద్ద ఈతగాళ్ల ఏర్పాటు విషయంలో అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం మాట్లాడుతూ (నేడు)సోమవారం జరిగే వినాయక నిమజ్జనానికి వచ్చే ప్రజలు,మండపాల నిర్వాహకులు పోలీసులు,మున్సిపల్ అధికారులకు సహకరించాలన్నారు.ప్రశాంత వాతావరణంలో ఉల్లాసంగా,ఉత్సాహంగా నిమజ్జనం జరగాలని ఆకాంక్షించారు. ఈ నియోజకవర్గ ప్రజలపై ఆ భగవంతుని ఆశీర్వాదం ఎప్పటికీ ఉండి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్‌డివో రాంమూర్తి, తహశీల్దార్ రవిందర్‌రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులు అందజేత


ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడి

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్15 ప్రభాతవార్త:** మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ అన్న మార్గం సిద్ధిరాములు, హవేళిఘనపూర్ మండలం షమ్నాపూర్ గ్రామానికి చెందిన సిద్ధిరాములు ఇటీవల ప్రమాదవశాత్తు పిడుగు పడి చనిపోయారు. ఈ ఇద్దరు బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ ఇన్సూరెన్స్ చేశారు. నామిని అయిన సిద్ధిరాములు భార్య మార్గం రాధమ్మ, చెట్టబోయిన సిద్ధిరాములు భార్య బాలమణి ఈ ఇద్దరికీ 2 లక్షల చొప్పున రూ.4,00,000 బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును వారి ఇంటికి వెళ్లి ఆదివారం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు కొండత భరోసా నిస్తుందని అన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల భీమా అందిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్యరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, మెదక్ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, హవేళిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, షమ్నాపూర్ మాజీ సర్పంచి లింగం, నాయకులు కిషన్‌గౌడ్, ఎలక్షన్‌రెడ్డి, నవీన్, రాములు, జహంగీర్, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రవి, దుర్గయ్య, కిష్టయ్యగౌడ్, సిద్ధయ్య, వినయ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు : కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ మున్సిపాలిటి, సెప్టెంబర్15 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 16వ తేదీ (నేడు) మిలాద్-ఉన్ నబీ పండుగ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా ప్రజావాణి ఉండదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణికి సంబంధించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజల సమస్యల కోసం ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, సెప్టెంబర్ 16వ తేదీ సోమవారం మిలాద్-ఉన్ నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని, కాబట్టి నేడు కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని తెలిపారు.

## అనంతసాగర్ చెరువు అలుగు ధ్వంసం

**కొండాపూర్, సెప్టెంబర్15 ప్రభాతవార్త:** అనంతసాగర్ చెరువు అలుగు ధ్వంసమైంది. కొండాపూర్ చెరువు నుండి పొంగిపొర్లుతున్న ఆలుగు ధ్వసం కావడంతో మంచినీరు వృధాగా పోతున్న పట్టించుకునే అధికారులు లేక చెరువులో నీరు ఖాళీ అయ్యా ప్రమాదం ఏర్పడింది. కొండాపూర్ మండలం పరిధిలోని అనంతసాగర్ చెరువు అలుగు కట్ట ధ్వంసం కావడంతో నీరు వేగంగా రావడంతో నీరంతా వృధాగా పోతుండటంతో చెరువు ఖాళీ అవుతుందని రైతులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలుగు ధ్వసం కావడంతో నీటితో పాటు చేపలు కూడా బయటకి రావడంతో మత్స్యకారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అనంతసాగర్ అలుగు కట్టను బాగు చేయాలని రైతులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.


ధ్వంసమైన చెరువు అలుగు

# రుణమాఫీపై స్పష్టతలేని ప్రభుత్వం

### గడువు దాటినా పూర్తికాని రైతురుణమాఫీ.. ఆందోళనలో అన్నదాతలు

**సంగారెడ్డిబ్యూరో సెప్టెంబరు 15,ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం చేపట్టిన రైతురుణమాఫీ పథకంపై స్పష్టతలేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు15తేదిలోగా రైతురుణమాఫీ ప్రక్రియపూర్తి చేస్తామని హామీ ఇచ్చినప్పటికి,నిర్ణీత గడువు దాటినెలరోజులు పూర్తి అయినా, రైతురుణమాఫీ ప్రక్రియనేటికి పూర్తికాకపోవడంపట్ల పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండులక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం, కొంతమేరచేసి,విగితాది మాఫీచేయడంలో తాత్సరం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పూర్తిచేయడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2018 డిసెంబరు 12నుండి 2023డిసెంబరు9వదేది వరకు బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులందరికి రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు.అనంతరం రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలు వారికి,చెల్లించాల్సిన రుణమాఫీ మొత్తంను లెక్కలు తీసి,రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీకి 31వేల కోట్లు అవసరమువుతాయని రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వీటిని ఆగస్టు15తేదిలోగా చెల్లింపులుచేసి రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన గడువు దాటినెల రోజులు అవుతున్నా ఇప్పటికి అర్హులైన అందరురైతులకు రుణమాఫీచేయలేకపోయింది. బ్యాంకులలో రెండులక్షలలోపు ఉన్నారైతులకు సుమారుగా 18వేల కోట్లు రుణమాఫీ చేశారు.ఇంకా13వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉంది. రెండులక్షలలోపు ఉన్నరైతులలో కూడ వివిద సాంకేతిక కారణాలతో అందులో కొందరకి రుణమాఫీ కాలేదు.అధార్‌కార్డులోని పేరు,రుణఖాతలోని పేర్లు వేరువేరుగా ఉండటం, ఇతర కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదు.రేషన్‌కార్డులేని వారి కుటుంభనిర్ధారణ కోరకు వ్యవసాయశాఖ అధికారులు,సర్వేనిర్వహిస్తున్నారు. సంగారెడ్డిజిల్లాలలో రేషన్‌కార్డులేని కుటుంభాలు 1850 ఉన్నట్లు గుర్తించి,వారికి సబందించిన వివిరాలు సేకరిస్తున్నారు.సంగారెడిజిల్లాలో ఇప్పటి వరకు లక్షరుపాయలు ఉన్నరుణమాఫీ పోందిన వారు 50538మందికి,846.31 కోట్లు,లక్షన్నర వరకు రుణంమాఫీ పోందిన వారు27233 మంది రైతులకు 277.73 కోట్లు మాఫీ కాగా, రెండు లక్షల వరకు రుణంఉన్న రైతులు20102 మందికి 281 కోట్లు రుణం మాఫీ జరిగింది. సాంకేతిక కారణాలతో అర్హత పోందని వారు 6063 మంది ఉన్నారు. రుణఖాత,ఆధార్‌కార్డులలో తప్పులు ఉన్నవాటిని, ఇతర కారణాలతో రుణాలు పోందలేకపోతున్న రైతుల సమస్యలు పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. రుణఖాత,ఆధార్ కార్డులలో పేర్లు తప్పులుగా ఉంటే,వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు, సంబందిత బ్యాంకులను సంప్రదించాలని వ్యవసాయశాఖ అధికారులు ఒకరిపై ఒకరు సమస్యను నెట్టేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.సాంకేతిక కారణాలతో రుణంపోందలేకపోతున్న రైతుల సమస్యల పరిష్కారం కోరకు వ్యవసాయశాఖ అధికారులకు లాగిన్‌లు ఇచ్చామని సంబందిత మంత్రి పెర్కోన్నప్పటికి,అలాంటివేవి తమకు అందలేదని వ్యవసాయశాఖ అధికారులు పెర్కోంటున్నారు. ప్రభుత్వశాఖల సమసన్వయంతో తాము నష్టపోతున్నామని రైతులు అవేదన వ్యక్తం చేస్తూన్నారు. రెండులక్షలపై రుణం ఉన్నరైతుల రుణ మాఫీపట్ల ఇప్పటికి స్పష్టంమై వైఖరిని ప్రకటించలేదు రాష్ట్రప్రభుత్వం. క్యాబినేట్‌లో చర్చించి నిర్ణయంతీసుకుంటామని ఇటీవల విలేకరుల సమావేశంలో ప్రకటించారు.


వినాయకుడిని నిమర్జనం చేస్తున్న దృశ్యం

## గంగమ్మ ఒడిలోకి గణనాథులు

### భక్తిప్రపత్తులతో వీడ్కోలు పలికిన భక్తులు

### ఆకట్టుకున్న గోండుల గుస్సాడీ నృత్యం

**పాపన్నపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువు దీరిన గణనాథుడు భక్తులతో 9 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు అందుకున్నాడు. భక్తులతో పూజలు


పాపన్నపేటలో గోండుల గుస్సాడీ నృత్యం దృశ్యం

అందుకున్న వక్రతుండుడు ఆదివారం గంగమ్మ ఒడికి చేరేందుకు పయనమయ్యాడు. అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనాల్లో బొజ్జగణపయ్యను ప్రతిష్టించుకుని భజనలు చేస్తూ, నృత్యాలు చేస్తూ భారీగా ఉరేగిస్తూ చెరువులు, కుంటల వద్దకు సాగిపోయారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో కొలువు దీరిన ఏకదందుడి మండపం వద్ద అదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజన తెగల సాంప్రదాయ నృత్యం గుస్పాడీ నృత్యాన్ని ప్రదర్శించారు. గోండుల గుస్పాడీ నృత్యాన్ని చూసేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆస్తిగా నృత్యాన్ని వీక్షించారు. తొలిపూజలందుకునే పార్వతీ దేవ తనయుడు ఏకదంతుడి చేతిలో ఉన్న లడ్డులను, మెడలో వేసిన పూలదండల వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని భక్తులు లడ్డులను, పూలదండలను దక్కించుకున్నారు.

# ప్రభుత్వ సలహాదారు కేశవరావు పర్యటన రద్దు

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్15 ప్రభాతవార్త:** ప్రజా పాలన దినోత్సవ ఏర్పాట్లు పకడ్బంధీగా నిర్వహిస్తున్నామని, సమీకృత కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ కమీషన్ చైర్మన్ కోదండ రామిరెడ్డి పతాక ఆవిష్కరణ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 17 మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా కె. కేశవరావు పతాక ఆవిష్కరణ గలదని గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగిందని, అనివార్య కారణాల వల్ల కె. కేశరావు పర్యటన రద్దు అయిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ కమీషన్ చైర్మన్ ఎ. కోదండరెడ్డి మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సెప్టెంబర్ 17 మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పతాక ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరవుతారని, అనంతరం ముఖ్య అతిథి సందేశం ఉంటుందన్నారు. ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి విచ్చేసే ఆహ్వానితులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జాతీయ రహదారి పనుల్లో నాణ్యత లోపం...!?

### లారీ ఎక్కడంతో కుప్పకూలిన మురుగు కాలువ


జాతీయ రహదారి పక్కన నిర్మించిన మోరీ కూలిపోయిన దృశ్యం

**హుస్నాబాద్‌రూరల్,సెప్టెంబరు15,ప్రభాతవార్త** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుండి సిద్దిపేట వరకు జరుగుతున్న జాతీయ రహదారి నెంబర్ 765డిజి పనుల్లో నాణ్యత లోపం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది.వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం రోడ్డు వేసిన కాంట్రాక్టర్ అదే రోడ్డు పక్కన నిర్మించిన మురుగు కాలువ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో శనివారం సాయంత్రం మోరీ పక్కన ఉన్న గుంతలో మట్టి పోసేందుకు వెళ్లిన మట్టి లారీ ఒక్క సారిగా కుంగిపోయి అదే మోరీలో ఇరుక్కుపోయిన సంఘటన చోటుచేసుకుందని గ్రామస్థుల ద్వార అందిన సమాచారం మేరకు తెలుస్తోంది.విషయం తెలిసిన కాంట్రాక్టర్ వర్క్ ఇన్స్‌పెక్టర్‌ల సహాయంతో భారీ యంత్రాలను తీసకు వచ్చి కుంగిపోయిన లారీని బయటకు తీయడంతో పాటు కూలిపోయిన మోరీ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు రాత్రికి రాత్రే పనులు చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే అప్పటికే చీకటి పడుతుండడంతో ఉదయమే పనులు చేపిస్తామని అక్కడున్న వర్క్ ఇంచార్జీలు అదే కూలిపోయిన కాలువలో మట్టిని నింపి విషయం బయటకు తెలియకుండా చూడాలని ప్రయత్నించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.ఈ విషయం సంబందిత అధికారుల దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనా ఈ జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పరీక్షించే అధికారులు స్పందించి వెంటనే నిర్మిస్తున్నరహదారి పనులతో పాటు పక్కనే నిర్మిస్తున్న మురుగు కాలువల నాణ్యతలను పరీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.లేని పక్షంలో రానున్న రోజుల్లో అమాయక ప్రయాణికులకు ప్రాణహాని కలిగే అవకాశాలు లేకపోలేవని స్పష్టం చేస్తున్నారు.


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఏచూరికి ఘన నివాళులు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఆదివారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో సీతారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు శ్రేణులు సీతారాం ఏచూరి బాటలో నడవడానికి అందరూ సిద్ధం కావాలన్నారు. ఆయన అశయాలను సాధించే వరకు పోరాటాలు చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, పులంపల్లి సాయిలు, పాశం చంద్రయ్య, ఎం.డి.గోరెమియా. పుట్ట బాల నారాయణ, చెక్క ఉప్పలయ్య, కిష్టయ్య, కిషన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు కుల వృత్తులను ప్రోత్సహించాలి

### కుమ్మర్ల సంఘం రాష్ట్ర నాయకులు : దరిపల్లి చంద్రం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల వృత్తులను ప్రోత్సహిస్తేనే మనుగడ ఉంటుందని శాలివాహన(కుమ్మరి సంఘం) రాష్ట్ర నాయకులు దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శాలివాహన(కుమ్మర్ల) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాలివాహనులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా పరంగా వెనుకబడి ఉన్నారని ఆయా రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కుల పటిష్టత కోసం పని చేయాలన్నారు. కుల వృత్తులను చిన్న చూపు చూడడం సరికాదని సమాజంలో కుల వృత్తులకు విలువలతో కూడిన మంచి భవిష్యత్ ఉందన్నారు. శాలివాహన (కుమ్మర్ల) కులంలో నైపుణ్యం కలిగిన విద్యావంతులు, మేధావులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అలాంటి వారు బయటకు వస్తేనే బల నిరూపణ నిరూపించుకునే శక్తి ఉంటుందన్నారు. కుమ్మర్లు నేటీకి చాల వరకు కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారని కుమ్మర్ల కులవృత్తిని ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. కుమ్మర్లు హక్కుల సాధన కోసం కలిసి కట్టుగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కుల సంఘం ప్రతినిధులు వేలాద్రి, లక్ష్మి, రాములు, సంతోష్, నాగరాజు, తరిగొప్పుల రామచంద్రం, దరిపల్లి బిక్షపతి, సత్యం, నగేష్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న నియోజకవర్గం ఇంచార్జి హరికృష్ణ

## సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** టిపిసిసి చీఫ్‌గా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సిద్దిపేట నుంచి నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. హైదారాబాద్ తరలివెళ్లే పార్టీ శ్రేణుల వాహనాలను నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ టిపిసిసి నూతన చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండ గుర్తింపు లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు పేదల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సిద్దిపేటను మరింత అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, పూజల గోపికృష్ణ, మంద పాండు, గయాజోద్దిన్, జనార్దన్, అజ్మత్, అంజిరెడ్డి, సాంబమూర్తి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## అవార్డు అందజేత



**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ది బెస్ట్ ఎడ్యుకేటర్.. కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ అవార్డు ప్రధాన ఉత్సవం..గురు పూజోత్సవం సందర్భంగా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం హైదారాబాద్‌లోని షాపూర్ నగర్ శుభం హోటల్‌లో శనివారం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన హనుమాన్‌నగర్‌లో డిఎస్ఎం హైస్కూల్ స్థాపించి 33 యేండ్ల అనుభవం కలిగిన విద్యావేత్త మిద్దెల యాదగిరికి ద బెస్ట్ అవార్డు ప్రధాన ఉత్సవంలో ద బస్ట్ ఎడ్యుకేటర్ అండ్ కరస్పాండెంట్ ప్రిన్సిపల్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డైరెక్టర్ శ్రీజ, ట్రిష్మా చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు పాల్గొన్నారు.

## నేడు, రేపు వినాయక నిమజ్జనం

### జిల్లాలో పటిష్టమైన బందోబస్తు : సీపీ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లాలో ఈనెల 16,17వ తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గణేష్ నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తునట్లు సీపీ డా॥అనురాధ తెలిపారు.ఆదివారం ఆమె మాట్లాడుతూ గణేష్ శోభాయాత్రలో డిజె వినియోగం, బాణాసంచా వాడకంపై నిషేధం విధించినట్లు తెలిపారు. శాంతియుత ప్రశాంతమైన వాతావరణంలో అంగరంగవైభవంగా వినాయక శోభాయాత్ర నిర్వహించుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు, ఎర్రచెరువు, గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరవు, ప్రజ్ఞాపూర్‌లో ఊరచెరువు, దుబ్బాక రామసముద్రం చెరువు,హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు,చేర్యాల కుడి చెరువుల ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర ప్రదేశాలతో పాటు నిమజ్జనం చేసే చెరువుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాలను జియో ట్యాగింగ్ చేయడం జరిగిందన్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె వివరించారు.

## అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డుకు మహర్దశ

### -జోగిపేట మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ జోగినాథ్ గుప్తా

**అల్లాదుర్గం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గం నుంచి న్యాల్‌కల్ మండలంలోని మెటల్‌కుంట వరకు జాతీయ రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం అయినట్లు జోగిపేట మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ జోగినాథ్ గుప్తా తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జోగినాథ్ మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర రహదారి అయిన అల్లాదుర్గం-మెటల్‌కుంట వరకు ఉన్న 47 కిలో మీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి పునర్ నిర్మించాలని, కరీంనగర్ నుంచి సిద్దిపేట వరకు, సిద్దిపేట నుంచి మెదక్, మెదక్ నుంచి బొడ్మట్‌పల్లి అల్లాదుర్గం చౌరస్తా మీదుగా మెటల్‌కుంట వరకు రోడ్డు నిర్మాణానికి డిలీలో ప్రధాన మంత్రి కార్యాలయంలో, కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి వినతి పత్రం అందచేయగా రోడ్డు నిర్మాణానికి సానుకూలంగా స్పందించారన్నారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే ఆయా మండలాల్లోని ప్రముఖ ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులకు సౌకర్యం కల్గుతుందన్నారు. రోడ్డు నిర్మాణానికి సానుకూలంగా స్పందించేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఎంపిలు సురేశ్‌కుమార్ శెట్కార్, రఘునందన్‌రావులు తమ వంతు సహకారం అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అందోల్ నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్, అందోల్ మండల మాజీ జడ్పీటిసి సభ్యులు భూమయ్య, అల్లాదుర్గం మండల బిజెపి అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, నాయకులు బ్రహ్మం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


విలేఖరులతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిలుకర రవికుమార్

## 26న తెలంగాణ క్రిస్టియన్ జెఎసి రాష్ట్ర స్థాయి సదస్సు

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** తెలంగాణ క్రిస్టియన్ జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని జెఎసి రాష్ట్ర ఛైర్మన్ జిలుకర రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాడిక్కడ రాష్ట్ర స్థాయి సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సులో రాష్ట్ర మంత్రులు కొండ సురేఖ, పార్లమెంట్‌సభ్యుడు మల్లు రవి, వద్దిరాజు రవిచంద్ర, తెలంగాణ ఉద్యమ సారధి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సినీ నటుడు బాబుమోహన్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. గత ఏడాది సెప్టెంబరు 17వ తేదీన తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో క్రైస్తవులకు నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంక్షేమ ఫలాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి 250 గజాల స్థలం కేటాయించాలని, ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంలో ఇల్లుకట్టుకోవడానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, ప్రతి నెల 10 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ఆయన సిఎంని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జెఎసి కో-ఛైర్మన్ మేకల సారయ్య, నాయకులు స్టీఫెన్, లుదియా, పద్మ, ఏసురత్నం, కుర్రి ఏలియా, చెరకూరి రత్నరాజు పాల్గొన్నారు.

## ఆర్టిజన్స్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 23, 667 మంది ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జెఎసి డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని జెఎసి హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన టివిఎసి-జెఎసి ఆవిర్భావ సభలో జెఎసి ఛైర్మన్, కె.ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎం.ఎ.వజీర్, కో-ఛైర్మన్ బి.భాస్కర్, కో-కన్వీనర్ జి.నాగరాజు ప్రసంగించారు. శాశ్వత ఉద్యోగులతోపాటు సమానంగా పనిచేసే ఈ కాంట్రాక్ట్ కార్మికులను గత ప్రభుత్వం పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పేరుతో అతి తక్కువ వేతనాలు ఇచ్చి యాజమాన్యం చేసిందని, ఈ కార్మికులకు ఆర్టిజన్స్ పేరును తగిలించి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా సిఎం ఈ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. వీరిని రెగ్యులరైజ్ చేసినందువల్ల ప్రభుత్వానికి ఏలాంటి ఆర్థిక భారం పడదని, ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో జి.అరవింద్‌కుమార్, బి.తిరుపతి, నరేందర్, ఎల్లయ్య, ఎస్.సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



పూజలు నిర్వహిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిబాబా, బాల్‌రాజ్‌గౌడ్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** గణనాధుడి దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలుగు దేశం పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వీధిలో చిక్కడపల్లి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మంటపాన్ని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పి.బాల్‌రాజ్‌గౌడ్‌తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగు నగేష్, అసోసియేషన్ ప్రతినిధులు పాశం లక్ష్మణ్, పాశం రవి, నవనీతం, డి.చంద్రమోహన్‌గౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : అభిషేక్ అడపా



కాంగ్రెస్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అభిషేక్ అడపా

**బేగంపేట, సెప్టెంబరు 15,ప్రభాతవార్త :** బేగంపేట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు బేగంపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అభిషేక్ అడపా అన్నారు.ఆదివారం బేగంపేట డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అభిషేక్ అడపా మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ ఆధ్వర్యంలో బేగంపేట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.ప్రతి సీనియర్ నాయకుడిని,కాంగ్రెస్ కార్యకర్తను కల్సుకుని వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు.పార్టీ బలోపేతానికి బూత్ స్థాయిలో ఉన్న కమిటీలను మరింత బలోపేతం చేయనున్నట్లు అభిషేక్ అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. అలాగే సంక్షేమ పథకాలు అందించే దిశగా అడుగులు వేయడాన్ని ఆయన అభినందించారు.రానున్న రోజుల్లో డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో పర్యటించి క్యాడర్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు.ఈ సమావేశంలో సనత్‌నగర్ నియోజకవర్గం మాజీ బీ బ్లాక్ అధ్యక్షుడు షేక్ గౌస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనీఫ్‌ఖాన్, లక్ష్మణ్, సాయికుమార్, నసీరుద్దీన్ (అడ్డూ), మునీర్‌ఖాన్, చిరంజీవి, అల్తమాష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల ప్రతిభ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ స్కూల్‌గేమ్స్ అండర్-19 జూనియర్ కళాశాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాల బాలుర, బాలికలు ప్రతిభను కనబర్చారు. కబడ్డి, ఖోఖో, వాలీబాల్, హాకీ టోర్నమెంట్స్ అకాడమి సెలెక్షన్స్‌లో మొత్తం 58 కళాశాలల నుంచి పద్నారువందల మంది విద్యార్థులు వివిధ క్రీడలు, ఆటలలో పాల్గొనగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ స్థానాలలో ప్రతిభ కనబర్చారు. రాబోయే రోజుల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ టోర్నీలలో 08 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కాగా కబడ్డి పురుషుల విభాగంలో రెండవ స్థానం, ఖోఖోలో మూడవ స్థానంలో రాణించారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహేందర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చీకటి పొరల్లోకి నెట్టాలని చూస్తున్న

# బిజెపి ఆటలు సాగనీయబోం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహా**




మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** నిజాం రాచరిక పాలనకు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా సాగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ వాస్తవచరిత్రను చీకటి పొరల్లోకి నెట్టాలనుకుంటున్న బిజెపి ఆటలు సాగనీయబోమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ హెచ్చరించారు. భూస్వామ్య వర్గం గ్రామాలలో ప్రజలపైన బలవంతపు పన్నులు వేసే వారని, వెట్టిచాకిరి చేయాల్సిన అనివార్య పరిస్థితిని సృషి ంచారని ఆయన ఆరోపించారు. ఈ నెల 17వ తేదీన తెలంగాణ సాయుధ పోరాటాని న్ స్మరించుకుందాం, తెలంగాణను లౌకిక ప్రజాస్వామ్యం వైపు నడిపిద్దాం అనే నినాదంతో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో సిపిఐ హైదరాబాద్‌జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయా దేవితో కలిసి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటాని న్ స్మరించుకుంటూ వారం రోజులుగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఇ.టి.నర్సింహ చెప్పారు. రైతులు పండించిన పంటలపై వారికి అధికారం లేకుండా భూస్వామ్య గుండాలు పండిన పంటను దోచుకునేవారని, కుల మతాలకు అతీతంగా ఉచితంగా భూస్వాములు ఇళ్లల్లో, పంట పొలాలలో, శుభకార్యాలయాల్లో ఆయా వృత్తులకు సంబంధించిన పనులు బలవంతంగా చేయించుకునేవారని ఆయన ఆరోపించారు. ఈ భూస్వాములకుపై ఉన్న నిజాం సర్కార్ పూర్తి అండదండలు, సహకారాలు అందించడమే కాకుండా అవసరమైనప్పుడు ప్రజలపై దాడులు చేయడానికి సైనాన్ని పంపించేవారన్నారు. నిజాం పాలనలో సభలు, సమావేశాలు జరుపుకునే హక్కు లేదని, అనేక ఆంక్షలు విధించారని, ప్రజావ్యతిరేక విధానాలపై మాట్లాడే గొంతుకలను అణిచివేసేవారని, కవులు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులు కలాలకు గళాలను పదును పెట్టి రాచరిక వ్యవస్థపైకి పోరాటానికి ప్రజలను సిద్ధం చేశారని ఆయన వివరించారు. 1996వరకు గవర్నర్‌గా నిజాం ఉన్నారని, అప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు హైదరాబాద్ సంస్థానం విమోచనం జరిగిందని ఏలా చెపుతారని ?, దీనికి సమాధానం చెప్పాలని ఇ.టి.నర్సింహ డిమాండ్ చేశారు. దేశస్వాతంత్ర్య పోరాటానికి, హైదరాబాద్ సంస్థానంలో జరిగిన భూస్వామ్య నిరంకుశ పాలనకు ఏనాడు మద్దతు తెలపకుండా పాలకవర్గాలకు వత్తాసు పలికిన ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు నేడు చరిత్రను కప్పిపుచ్చి ప్రజలు చేసిన త్యాగాలను చెప్పకుండా చేసే ప్రయత్నాలను ఎండగడతామని హెచ్చరించారు. దేశంలో జరిగిన ఏ ప్రజా పోరాటంతో సంబంధం లేకుండా తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకి మత రంగు పులిమి విభజన రాజకీయాలు తీసుకువచ్చి రాజకీయ లబ్ధిపొందడానికి ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. సమావేశంలో సమితి సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.వెంకటేశం, నాయకులు చందు నాయక్, చంద్రమోహన్‌గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, ఉమర్‌ఖాన్ పాల్గొన్నారు.




గురువులను సత్కరిస్తున్న దామోదర్‌గుప్తా, రమణారావు తదితరులు

## విజ్ఞానజ్యోతిని వెలిగించేది గురువులే

**రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వాధ్యక్షుడు కోలేటి దామోదర్‌గుప్తా**

**రవీంద్రభారతి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** చదువుతోపాటు విద్యార్థులకు వివిధ కళలను నేర్పేది గురువులేనని, ప్రతీ గురువు శిష్యుల్లో అంతర్గతంగా ఉన్న అజ్ఞాన తిమిరాన్ని తరిమికొట్టి వారిలో విజ్ఞానజ్యోతిని వెలిగించి చైతన్యవంతుల్ని అభ్యుదయపథంలో పయనింపజేసేది గురువులేనని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ అధ్యక్షుడు కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. వివిధ కళాసంస్థలు శిష్యబృందంచే శాస్త్రీయ, సంప్రదాయ, జానపద కళారీతుల్లో నృత్యప్రదర్శనలతో తమ గురువులకు గురువందనం సమర్పించడం, ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించిన లయన్ రమణారావు, సంస్థను ఎంతగానో అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జైజవాన్! జై కిసాన్!! జై కళాకార్!!! ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు ఏబిసి ఫౌండేషన్, నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోలేటి దామోదర్‌గుప్తా విశిష్ట అతిథులు విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. సుబ్రహ్మణ్యం, కూచిపూడి యక్షగాన నృత్య గంధర్వ శిరోమణి డా. ఏలేశ్వరపు చలపతిశాస్త్రి, ప్రఖ్యాత శాస్త్రీయ నృత్య గురువు, గాయని, చిత్రకళాకారిణి సోనాలి ఆచార్జీ, చకిలం సుధాకర్, డా. నాగుల సత్యంగౌడ్ తదితరులతో కలిసి ఈనాటి కళాప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి, గురువులు 15మందిని ఘనంగా సత్కరించి గురుకంకణ ధారణ కావించి శుభాకాంక్షలు తెలిపారు.

## వినాయకుడి లడ్డూ వేలం

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వెంగళరావునగర్ వెంగళరావునగర్ జిటియస్ శ్రీవీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయి బాబా దేవాలయంలో ఏర్పాటుచేసిన గణేషుని నిమజ్జనం సందర్భంగా లడ్డ వేలంపాట నిర్వహించారు.రహ్మత్‌నగర్‌కు చెందిన భక్తుడు సాయిప్రకాష్ రూ.26,100కు లడ్డును కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి గుమ్మడిదళ సుధాకర్, ఆలయ అరర్చకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వెంకటగిరిలో...**

యూసుఫ్‌గూడ డివిజన్‌పరిధిలోని వెంకటగిరిలో శ్రీ వీరాజనేయ స్వామి దేవాలయంలో నవరాత్రుల సందర్భంగా నెలకొన్న ఘననాధుని లడ్డు వేలంపాట ఆదివారం జరిగింది. వేలం పాటలో వెంకటగిరికి చెందిన బీజేపి సీనియర్ నాయకులు ఆలయ కమిటి ఆర్గనైజింగ్ సెక్రటరీ బడుగు సతీష్ రూ.50,516లకు లడ్డును కైవసం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ సుదర్శన్‌రావు, అధ్యక్షులు నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షులు చారి, కోశాధికారి రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటకీ వేణుగోపాల్, కమిటి సభ్యులు బసవరాజు, వెంకటేష్, ప్రధాన అర్చకులు సంతోష్ కుమార్, సందీప్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.



రూ.26,100కు వినాయక లడ్డును కైవసం చేసుకున్న సాయిప్రకాష్



లడ్డూను రూ.4,50,000లకు దక్కించుకున్న నీలేష్ కుమార్ దూబే

## రూ.లక్షల్లో పలికిన లంబోదరుడి లడ్డూలు

**- నెక్‌నాంపూర్‌లో రూ.4లక్షల 50వేలు పలికిన లడ్డూ**

**నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** గండిపేట మండలంలో 9.రోజుల పాటు సాగిన గణేష్ నవరాత్రి వేడుకలు వైభవంగా పూర్తయ్యాయి. భక్తులు పోటా పోటీగా వినాయక ప్రతిమలు కొని, అందంగా మండపాలు నిర్మించి 9 రోజులు భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. నిత్యాన్నదానాలు, ఏకదంతుడి మహిమలను స్తుతిస్తూ భజన పోటీలు నిర్వహించారు. ఆదివారం 90.శాతం గణేష్‌లను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన "లంబోదరుడి మహిమాన్విత లడ్డూలు" రూ.లక్షల్లో పలికాయి. భక్తులు పోటీలు పడి వేలం పాటల్లో గణపతి లడ్డూలు దక్కించుకొని దైవంపై తమకున్న విశ్వాసాన్ని ప్రకటించుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ నెక్‌నాంపూర్‌లో ప్రతిష్టించిన లడ్డూను రూ.4,50,000 నీలేష్ దూబే దక్కించుకున్నాడు. అలాగే బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని వక్రతుండిడి లడ్డూను విష్ణుమూర్తి రూ.1,11,000లకు కైవసం చేసుకున్నాడు. అలాగే మరికొన్ని ప్రాంతాలలో రూ.90.వేలు, 75.వేలు, 50.వేలు, 45.వేలు ఇలా భక్తులు భగవంతుడి లడ్డూలను దక్కించుకొని మురిసిపోయారు.

## బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

**-విద్యార్థుల తల్లిదండ్రులు**

**నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** నార్సింగిలో ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ప్రిన్సిపాల్‌కు సూచించారు. పేరున్న పాఠశాల అని మా బిడ్డలను చేర్చామని, ఇక్కడ కనీస వసతులు లేక మా బిడ్డలు నరకయాతన పడుతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పాఠశాలకు తమ బిడ్డలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులు తమ బిడ్డలు చెప్పే బాధలు విని కన్నీరు మున్నీరయ్యారని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో మరుగుదొడ్లలో టైల్స్ పగిలిపోయాయని, నల్లాల్లో నీరు రావడం లేదని, దోమల సమస్య తీవ్రంగా ఉందని, తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని, ప్రహారీగోడ కూలిపోయినా నిర్మించడం లేదని, అదనంగా మరుగుదొడ్లు నిర్మించాలని, నాశీరకమైన ఆహారంను పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘనత వహించిన వసతి గృహమని ఇక్కడ చేర్పిస్తే అన్నీ సమస్యలే ఉన్నాయని, మరమ్మత్తులు చేయాలని ఎన్నిమార్లు కోరినా పాఠశాల ప్రిన్సిపాల్ స్పందించడం లేదని ఆరోపించారు. చదువుల సంగతేమో కానీ ఈ సమస్యలుంటే మా బిడ్డలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రిన్సిపాల్ కృపవరం దృష్టికి తీసుకెళితే... అన్ని పనులు నేను చేయలేనని, ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తరువాత చేస్తామని సమాధానం ఇస్తున్నారని శ్రీకృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ సర్కారు వెంటనే స్పందించి గురుకులాల్లో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం చేసేందుకు నిదులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



నార్సింగిలోని బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌ను కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు.

# జ్ఞానదీపాన్ని వెలిగించేది ఉపాధ్యాయుడే

**ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**

**నాంపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** సమాజంలో పెద్దలు, మహాత్ములైన గురువులు ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ పూజించాలని, జగద్గురువైన శ్రీకృష్ణుడు కూడా తన గురువును గౌరవించారన్న ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి హృదయ జ్ఞానదీపాన్ని వెలిగించి మనిషిలోని అంధాకారాన్ని తొలగించి జీవితంలో వెలుగును నింపేవాడు ఉపాధ్యాయుడే అన్నారు. సూర్యుడుంటే ఎలాగైతే చీకటికి చిరునామా ఉండదో అంతరంగంలో జ్ఞాన సూర్యుడిని గురువు ప్రవేశపెట్టిన తర్వాత శిష్యుడి అంతరంగంలో చీకటి తిమిరం ఉండదన్నారు. గురు శిష్య అనుబంధం చాలా గొప్పదని, మహామహులను సృష్టించే శక్తి గురువుకు ఉంటుందని, కానీ మారిన దుస్థితి వల్ల నేడు విద్యార్థులకు ర్యాంకుల మీదు,ఉపాధ్యాయులకు ప్యాకేజీలమీదే దృష్టిమిగిలే దురదృష్టకరమైన వాతావరణం వచ్చిపడిందని వాపోయారు. పాఠశాల గదియొక్క ప్రాముఖ్యతను వివరించి చెప్పిన భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకొంటామని తెలిపారు. కమలాకర లలిత కళాభారతి లైనెస్‌క్లబ్ ఆఫ్ సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లాప్రగడ విశిష్ట అతిథులు డా. వద్దూరి ఆంజనేయులు, భ్రమరాంబిక శైలజామిత్ర, భారతి కమలాకర్ తదితరులతో కలిసి 10మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేసి అభినందించారు.



ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారకర్తలతో శ్రీమన్నారాయణమూర్తి, కసిరెడ్డి, భారతి కమలాకర్ అతిథులు



## ఎంత ఉన్నతికి ఎదిగినా సంస్కారం ముఖ్యం

**-హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** ఉన్నత స్థాయికి ఎదగటమే ముఖ్యం కాదని, ఎంత సంస్కారవంతంగా వారు ఉన్నారన్న దానిపై వారికి సమాజంలో గుర్తింపు పుష్కలంగా లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో మూడురోజుల పాటు వంశీ ఆర్ట్ థియేటర్స్ 53వ వార్షికోత్సవాల సంబురాలు 'సంగీత-నృత్య-నాటక సాహిత్యమహోత్సవాలు' పద్మవిభూషణ్, నటసమ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు, పద్మభూషణ్ డాక్టర్ భానుమతిరామకృష్ణ శతజయంతి ఉత్సవాల ముగింపు సభ నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకపల్లి ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు స్వాగతం పలికారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభలో 'వంశీ కథలు' పుస్తకాన్ని ఆవిష్కరించగా, సుప్రసిద్ధ సినీనటులు తనికెళ్ళ భరణికి 'అక్కినేని-భానుమతి'పేర వంశీ జాతీయ పురస్కారం ప్రదానం చేసిన అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ రాధారాణి మాట్లాడారు. భానుమతి స్వాభిమానం ఉన్న నటి, దర్శకురాలు, రచయిత్రి, గాయని, స్టూడియో అధినేత అని, అక్కినేని కూడా ఉన్నత నటనతో పాటు తన ఆలోచనలు ఆ పేరిట రాశారన్నారు. కాగా నూతనంగా ఆవిష్కరించిన పుస్తకాన్ని ఉగాండా దేశంలో ఉంటున్న డాక్టర్ బి.వ్యాసకృష్ణ-రాధలకు అంకితమిచ్చారు. ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు, పూర్వ రవాణా శాఖ జాయింట్ కమిషన్ సిఎల్ఎన్.గాంధీ, వికలాంగ సంస్థ జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, సాహితికిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## హెబ్రోన్‌చర్చ్‌లో ప్రశాంతంగా ప్రార్థనలు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ చర్చ్‌లో ఆదివారం ప్రశాంతంగా ప్రార్థనలు జరిగాయి. ప్రముఖ దైవసేవకుడు బ్రదర్ జోసెఫ్ కురియన్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో జాన్ సుబ్బారెడ్డి, సిహెచ్.సామ్యుల్, ఎఫ్‌సిఎస్. పీటర్‌లు పరిచర్య చేయడం జరిగింది. సొసైటీ అని కొందరు, ట్రస్ట్ అని కొందరు విడిపోవడం ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం వాస్తమే, కానీ ఇప్పుడు ఇరువర్గాల మధ్య విభేధాలు లేవు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు మధ్యవర్తిత్వంతో ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం ప్రార్థనలు ఎలాంటి ఆటంకం లేకుండా కలిసి ఐక్యంగా ప్రార్థనలు నిర్వహించారు.

## వైభవోపేతంగా ఫలపంచామృతాభిషేకం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఫలపంచామృతాభిషేకం పూజాకార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఉదయం సుప్రభాతము, బిందె తీర్థం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి మూల మంత్ర హవనం, సాయంత్రం లక్ష్మీగణపతి మహిళా భక్త సమానం, ఆధ్వర్యంలో లలిత-విష్ణు సహస్రనామ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా మంగళవారం భస్మార్చన కార్యక్రమం ఉంటుందని ఈవో వివరించారు.

## మహేష్‌కుమార్‌గౌడ్‌కు సత్కారం



మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభినందిస్తున్న లీగల్ సెల్ ప్రతినిధులు

**సైఫాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** తెలంగాణ-పిసిసి అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను టి-పిసిసి లీగల్‌సెల్ (చట్టం, మానవ హక్కులు, ఆర్టీఐ విభాగం ప్రతినిధులు ఆదివారం నాడిక్కడ ఘనంగా సత్కరించి, అభినందనలు, శుకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ వైస్-ఛైర్మన్ తిరుపతి వర్మ, కిషన్‌రాజ్‌చౌహాన్, ఠాకూర్ సురేఖ దీప్‌సింగ, రాజ్‌కుమార్, అశోక్‌రెడ్డి, తిరుపతి, బండి తరుణ్, సుగుణ, రాజేందర్, వికాస్‌సింగ్, నరసింహ, శ్రీధర్‌రాజు, ఆర్.కృష్ణ, రెహమాన్, నవాజ్ పవన్, రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతివర్మ మాట్లాడుతూ ఎఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్‌ఖర్గే నేతృత్వంలో మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ మరింతగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## ఆన్‌లైన్‌లో ఉచిత సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషయల్ కోర్సులకు శిక్షణ

**హైదరాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో లక్ష మంది విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషయల్ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అకాడమీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సాయిశ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటా సైన్స్, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సులలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామని తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజి, ఇంజనీరింగ్ చదివిన యువకులు ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9505800050 సెల్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

## ట్యాంక్‌బండ్ వద్ద విగ్రహాల నిమజ్జనానికి అనుమతి

**పంజగుట్ట, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త):** ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం లేదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆదివారం ఉదయం తొలగించారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన జాలీలను తొలగించి ఉత్సవ సమితి నేతలే స్వయంగా వినాయక నిమజ్జనం చేశారు. ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం అనేక సంవత్సరాలుగా జరుగుతుందని, కొత్త రూల్స్ తీసుకొచ్చి భక్తుల మనోభావాలు దెబ్బ తీయడం సరికాదని వారు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వెంటనే ఆదివారం మధ్యాహ్నంలోగా ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జన ఏర్పాట్లు చేయాలని, లేనిపక్షంలో మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటుచేసి, ఆందోళన చేయడమేకాక ఎక్కడికక్కడ మండపాల్లో వినాయకులను ఉంచుతామని హెచ్చరికలతో కూడిన అల్టిమేటం గణేష్ ఉత్సవ సమితి నేతలు జారీ చేశారు. దీంతో పోలీసు అధికారులు,వివిధశాఖల ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దలతో చర్చించి వెంటనే జాలీలను తొలగించడమేకాకుండా ట్యాంక్‌బండ్‌పై ప్రతి ఏటా జరిగేలా నిమజ్జన ఏర్పాట్లు చేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

## లారీ డ్రైవర్‌కు ఫిట్స్...లారీ బీభత్సం

**నాచారం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో లారీ రోడ్డు పక్కనే ఉన్న షాపుల్లోకి వెళ్లింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాని షాపుల వారికి నష్టం వాటిల్లింది. నాచారం పోలీసులు కథనం ప్రకారం. హబ్సిగూడ నుంచి నాచారం వైపు ఆదివారం లారీ నడుపుకుంటూ వెళుతున్న డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. దీంతో లారీ ప్రధాన రోడ్డు పై ఉన్న షాపుల్లోకి వెళ్లింది. వెంటనే అప్రమత్తమైన షాపులవారు ఉరుకులు పరుగులు తీశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఈ మేరకు నాచారం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు.

# వినాయక నిమజ్జనం..కీలక ఘట్టానికి సన్నాహాలు

## నగరంలో రూట్‌మ్యాప్‌ను విడుదల చేసిన పోలీసు కమిషనర్ సివి ఆనంద్



**పంజగుట్ట, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త):** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కీలకఘట్టమైన నిమజ్జనానికి సన్నాహాలు తుది దశకు చేరుకున్నాయి. 17వ తేదీన నిమజ్జనం సందర్భంగా బాలాపూర్ సహా నగరంలోని విగ్రహాల ఊరేగింపు, ఖైరతాబాద్ నిమజ్జనం, ప్రధాన ఊరేగింపుకు రూట్‌మ్యాప్‌ను నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ విడుదల చేశారు. బాలాపూర్‌లోని అతి ముఖ్యమైన గణేష్ విగ్రహం నుంచి ప్రారంభమై హుసేన్‌సాగర్‌లో ముగిసే 19 కిలోమీటర్ల మేర పాదయాత్ర వివరాలను కమిషనర్ వెల్లడించారు. కట్టమైసమ్మ వద్ద హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి గుర్ర చెరువు ప్రవేశిస్తుందని అక్కడ నుండి 18 ముఖ్యమైన జంక్షన్‌ల మీదుగా వెళ్లే ప్రాంతాల్లో పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరిస్తున్నట్లు తెలిపారు. చార్మినార్, తెలుగుతల్లి బ్రిడ్జి సమీపంలోని ఊరేగింపు మార్గాలను పరిశీలించి విగ్రహాలను తరలించే వాహనాలు, ఎత్తు ఆధారంగా ఇప్పటికే పలు సూచనలు చేశామని వివరించారు..

**రూట్ మ్యాప్ ఇలా...**

**రూట్‌నంబర్ 1...** బాలాపూర్ గణేష్ శోభాయాత్ర బాలాపూర్ నుండి కేశవగిరి, చాంద్రాయణగుట్ట, ఎంబీఎన్ఆర్ క్రాస్‌రోడ్డు, ఫలక్‌నామా రైల్వే బ్రిడ్జ్, అలియాబాద్, నాగుల్చింత, చార్మినార్, అఫ్జల్ బగుర్జాల్, ఎంజె మార్కెట్, బషీర్‌బాగ్, లిబర్టీ, ఎన్టీఆర్ మార్గ్, అంబేద్కర్ విగ్రహం, నెక్లెస్ రోడ్డు వరకు విస్తరించి ఉందని తెలిపారు.

**రూట్‌నంబర్ 2 సౌత్‌జోన్...** హుసేనీఆలం, బహదూర్‌పురా మీదుగా..

**రూట్‌నంబర్ 3 ఈస్ట్‌జోన్...** రామాంతపూర్, తార్నాక, హబ్సీగూడ, చిలకలగూడ ఎక్స్‌రోడ్, కాచిగూడ, ఇస్మాయిలీ బజార్‌మీదుగా శోభాయాత్ర..

**రూట్‌నంబర్ 4 వెస్ట్‌జోన్..** ధూల్‌పేట, టప్పాచపుత్ర, రేతిబౌలి మీదుగా శోభాయాత్ర..

**రూట్‌నంబర్ 5 వెస్ట్‌జోన్..** ఎర్రగడ్డ, బల్కంపేట, యూసుఫ్‌గూడ, ఎన్టీఆర్ భవన్, అగ్రసేన్ జంక్షన్ మీదుగా హుసేన్ సాగర్‌కు చేరుకోవాలి.

**రూట్‌నంబర్ 6 నార్త్‌జోన్..** గణేష్‌టెంపుల్ సికింద్రాబాద్, బేగంపేట మీదుగా..

**రూట్‌నంబర్ 7..** ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్ర జరుగుతుంది. ఉదయం 6.30 గంటలకు మహా గణపతి పూజ పూర్తవుతుందని ఆయన వివరించారు.

**ఖైరతాబాద్ మహా గణపతి పూజా కార్యక్రమాలు....**

ఖైరతాబాద్ మహా గణపతి పూజా కార్యక్రమాలను ఉదయం 6.30 గంటలకు పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించనట్లు సిపి ఆనంద్ వెల్లడించారు. దీనిక ఉత్సవ కమిటీ సభ్యులు అంగీకరించారన్నారు. బడా గణేష్ శోభాయాత్ర నిమజ్జనాన్ని తిలకించేందుకు లక్షలాదిమంది హుసేన్ సాగర్‌కు తరలిరానున్నందున మహిళలు, పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా షీటీమ్స్ పోలీసులు మఫ్టీలో ఉంటారని ఆయన తెలిపారు. క్విక్ రెస్పాన్స్ టీంలు, డాగ్ స్క్వాడ్‌లు, యాంటీ చైన్ స్నాచింగ్ టీంలను నియమించినట్లు సీపీ తెలిపారు. సీసీ కెమరాల ద్వారా భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఐటీసెల్ అధికారులు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా 17వ తేదీ 6 గంటల నుంచి 18వ తేదీ ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ తెలిపారు.

# మెట్రోలో ప్రయాణించిన మేయర్ విజయలక్ష్మి

## తొలిసారిగా ఎల్బీనగర్ స్టేషన్‌లో ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం



**హైదరాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త**

మెట్రోలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రయాణించారు. ఆదివారం మూసరంబాగ్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వరకు మేయర్ ప్రయాణించారు. గణేష్ నిమజ్జనం కోసం భక్తులకు స్వాగతం పలుకుతూ పోస్టర్ ఏర్పాటు చేయాలని మెట్రోఅధికారులు మేయర్‌ను కోరారు. నిమజ్జనం రోజు ఎక్కువ సమయం వరకు మెట్రో రైలు నడపడంతో పాటు వచ్చే భక్తులకు సరైన ఏర్పాట్లుచేయాలని మేయర్ సూచించారు. మెట్రోలో ప్రయాణం చేస్తూ ప్రయాణికులతో మాట్లాడి మెట్రో సేవలు, సౌకర్యాలను మేయర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమైన వారితో మెట్రోలో కాసేపు సరదాగా గడిపారు. పిల్లల మధ్యలో కూర్చొని వారితో ముచ్చటించారు. అనంతరం ప్రజల సూచనలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని మెట్రో అధికారులకు సూచించారు. అంతకుముందు ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌లో పాలీ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెట్రో ప్రయాణికులతో పాటు చుట్టు పక్కలప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తొలిసారిగా హెల్త్ ఏటీఎం కూడా అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రకనత పరీక్షల దయాగ్నస్టిక్ సౌకర్యం, మెడికల్ షాప్, వైద్య నిపుణులు, ఫిజియోథెరఫీ, టెలీమెడిసిన్, డెంటల్ కేర్ ఇలా అన్నీ సౌకర్యాలు మెట్రో స్టేషన్‌లో ఉంటాయని వెల్లడించారు.



# ఖైరతాబాద్ గణేష్‌కు భక్తుల తాకిడి ఎఫెక్ట్...

## లక్‌డికా పూల్ పరిసరాలలో భారీగా ట్రాఫిక్ జాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహాన్ని చూసేందుకు ఆదివారం వేల సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో లక్‌డికాపూల్ సహా పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. గణేషుడిని వీక్షించేందుకు ఆదివారం చివరి రోజు అవడంతో భక్తులు భారీగా వుండడంతో కంట్రోల్ చేయడం పోలీసులకు కష్టంగా మారింది. ఇదే ప్రాంతంలో ఖైరతాబాద్ మెట్రో రైల్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లు వుండడంతో రైళ్లలోనూ తరలివచ్చారు. ఎంఎంటిఎస్‌లో దూర ప్రాంతాల నుంచి తరలిరాగా మెట్రో రైల్‌లోనూ తరలివచ్చారు. ఉదయం పది గంటల నుంచే మొదలైన భక్తుల తాకిడి రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగింది. దీని కారణంగా ఖైరతాబాద్ చౌరస్తా, లక్‌డికాపూల్ చౌరస్తా, టెలిఫోన్ ఎక్స్ఛేంజి, ఇక్బాల్ మినార్ చౌరస్తాతో పాటు ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహం వుండే సమీప ప్రాంతాలైన మింట్ కాంపౌండ్ చౌరస్తా, ఐ మ్యాక్స్ చౌరస్తా, ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ చౌరస్తా, ఖైరతాబాద్ కూరగాయల మార్కెట్, వెల్‌నెస్ సెంటర్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి చౌరస్తా, లిబర్టి, నాంపల్లి, మోజం జాహీ మార్కెట్, అబిడ్స్ ప్రాంతాలలో వాహనాల రద్దీ ఎక్కువగా వుండడంతో ట్రాఫిక్ జాంలు ఏర్పడ్డాయి. ఈ మార్గాలలో వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేలా చేసేందుకు పోలీసులు నానాపాట్లు పడ్డారు. బడాగణేష్ విగ్రహాన్ని చూసేందుకు వచ్చిన భక్తులు తమ వాహనాలను నిలిపేందుకు పోలీసులు ఏర్పాటుచేసిన పార్కింగ్ కేంద్రాలలో కూడా ఊహించినదానికన్నా ఎక్కువ రావడంతో చాలా మంది తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపేసి గణేషుడిని దర్శనం చేసుకున్నారు. భక్తుల వాహనాలు రోడ్ల పక్కన నిలిపి వు ండడంతో దాని ప్రభావం సాధార ణ ట్రాఫిక్ రాకపోకలపై తీవ్ర ప్ర భావం పడింది. ట్రాఫిక్ జాం కారణంగా ఈ ప్రాంతంలోని రహదారులపై ప్రయాణించిన వాహన దారులు నానా ఇబ్బందులకు గురయ్యారు.

# సస్పెన్షన్ గురైనవారికి పోస్టింగ్‌లు

**పంజగుట్ట, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త):** నగర వ్యాప్తంగా ఇటీవల హోంగార్డు స్థాయి నుండి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు పలువురు పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. విధుల్లో నిర్లక్ష్యం, సమయానికి స్టేసన్‌కు రాకపోవడంలాంటి చిన్న చిన్న కారణాలతో పలువురు అధికారులు సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. నగర పోలీసు కమిషనర్‌గా వినాయక చవితి రోజు రెండోసారి నియమించబడిన సివి ఆనంద్ ఒకవైపు వినాయక నిమజ్జన ఏర్పాట్ల విషయంలో సీరియస్‌గా పరిశీలిస్తూనే మరోవైపు మెన్ సంక్షేమంపై దృష్టిసారించారు. చిన్న చిన్న కారణాల చేత సస్పెన్షన్‌కు గురైన వారి వివరాలు తెలుసుకున్న ఆయన వారికి వెంటనే సస్పెన్షన్ ఎత్తివేసి వినాయక పర్వదినాల్లో వారి కుటుంబాల్లో వెలుగునింపారు. మొత్తం సస్పెండ్ అయిన వారిలో ఒక ఇన్‌స్పెక్టర్, ఏడుగురు ఎస్ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్, ఐదుగురు కానిస్టేబుళ్లు, టైపిస్ట్, ఎల్‌జీఎస్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ నగర పోలీసు కమీషనర్ సివి ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# రేపు గణనాథుడి నిమజ్జనాలు

## అర్ధరాత్రి 2 వరకు మెట్రో రైల్ సేవలు

**హైదరాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** వినాయకుడి నిమజ్జనాల నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మంగళవారం పెద్ద ఎత్తున గణపతి నిమజ్జనోత్సవం జరగనున్న నేపథ్యంలో అర్ధరాత్రి 2 గంటల వరకు మెట్రో రైళ్లు నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. మెట్రో లైన్‌లలోని ప్రతి స్టార్టింగ్ స్టేషన్ నుంచి రాత్రి ఒంటి గంటకు చివరి రైలు బయలుదేరుతుందని తెలిపింది. నిమజ్జనం ముగిసే వరకు అవసరాన్ని బట్టి అదనపు రైళ్లు నడిపిస్తామని మెట్రోరైల్ సంస్థ స్పష్టంచేసింది. అంబర్‌పేట నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. వీధుల్లో గణపతిబప్ప మోరియా అంటూ నినాదాలు మారుమోగుతున్నాయి. ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ గురువారం పలు వినాయక మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. యంగ్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగన్ పాల్గొన్నారు.

# 20న కలెక్టరేట్లు, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి

## ఎంపి ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** కులగణన చేయాలని ఫీజుల బకాయిలు చెల్లించాలని ఈ నెల 20న కలెక్టరేట్లు... తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడి చేయనున్నట్లు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలో అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన రాష్ట్ర సంఘం కోర్‌కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పంచాయితీరాజ్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటీసీ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతంకు పెంచాలని మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు రూ. 5400 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఛలో కలెక్టరేట్, మండల ఆఫీసుల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా నేటికీ కులగణన చేయడంలేదన్నారు. ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడంలేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానం నెరవేర్చరా... ధిక్కరిస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయితీరాజ్ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతంకు పెంచాలని కోరారు. రాహుల్ గాంధీ ఇచ్చిన బీసీల గురించి అనుకూలంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ వాగ్దానాలను అమలు చేయడంలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవాడానికి వీలు లేదన్నారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్‌పై పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. అగ్రకులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులల్లో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణచేసి రాష్ట్రపతి సంతకం చేశారు కాని 50 శాతం జనాభాగల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా అన్నారు. దేశంలో బీసీలకు ఇదేమి న్యాయం అన్నారు. అసెంబ్లీలో చట్టంచేసి 42 శాతం పెట్టవచ్చని ఆర్.కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు రూ. 4500 ఉన్నాయని వీటిని చెల్లించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా పోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీ యాజమాన్యం ఇవ్వడంలేదదని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. విద్యార్థుల కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లు రాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, వంశీకృష్ణ, గొరిగె మల్లేష్‌యాదవ్, ఎస్. రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఆందోళనబాట పట్టనున్న గురుకుల ఉపాధ్యాయులు

**ఎల్‌బి నగర్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** అయిదు సొసైటీల ఆధ్వ ర్యంలో నిర్వహించబడుతున్న గురుకుల విద్యాలయాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురుకుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో దశల వారీగా చేపట్టే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని గురుకుల విద్యా జెఎసి నాయకులు కోరారు. ఈ నెల 17, 18వ తేదీలలో నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరు కావాలని, 19వ తేదీన ఉపాధ్యాయులు సంతకాలతో ప్రిన్సిపాల్స్ ద్వారా సెక్రటరీకి లేఖలు సమర్పించాలని, 28వ తేదీన పెన్‌డౌన్, చాక్ ద్వారా విధులను బహిష్కరించాలని వారు కోరారు. గురుకులాల ప్రారంభ వేళలను ఉదయం 9 గంటలకు మార్చాలని, జిఓ 317 అలకేషన్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపాలని, జిఓ 317 బాధితులకు న్యాయంనచేయాలని, అన్ని గురుకులాల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించాలని, స్వంత భవనాల నిర్మాణం చేపట్టాలని, విద్యార్థుల డైట్ ఛార్జిలను పెంచాలని, గురుకులాల ఉపాధ్యాయులు, సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, భోదనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని, నైట్ స్టే నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, రాబోయే పిఆర్‌సిలో గురుకుల ఉపాధ్యాయులకు కనీసం రెండు స్టేజిల అదనపు స్కేల్స్‌ను ఇవ్వాలని, అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, అన్ని సొసైటీల ఉపాధ్యాయులకు ఏకరూప సర్వీసు నిబంధనలు ఏర్పాటు చేయాలని, గురుకులాల్లో 70:30 ప్రమోషన్స్ ఇవ్వాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. జెఎసి చేపట్టే కార్యక్రమాలన్నింటిని విజయవంతం చేయాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.బాలరాజు కోరారు.

# ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు షురూ

* పోలీసుల ఫ్లెక్సీలు.. బారికేడ్లను తొలగించిన గణేశ్ ఉత్సవ సమితి నేతల
* ఆందోళనతో దిగొచ్చిన అధికారులు
* ట్యాంక్‌బండ్‌పై 12 భారీ క్రేన్లు ఏర్పాటు






**హైదరాబాద్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త**

గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనతో అధికారులు దిగొచ్చారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకూడదని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్లు తొలగించారు. నిమజ్జనానికి క్రేన్లు ఏర్పాటు చేశారు.

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇటీవల జిహెచ్ఎంసి, పోలీసు అధికారులు ట్యాంక్‌బండ్‌పై గణపతుల నిమజ్జనానికి ఆంక్షలు విధిస్తూ ఫ్లెక్సీలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్లను తొలగించారు. భక్తులతో కొన్ని విగ్రహాలు నిమజ్జనం చేయించారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ఏర్పాట్లు చేయకపోతే సోమవారం నగర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. కాసేపటికి అక్కడికి చేరుకున్న పోలీసులు భాగ్యనగర్ ఉత్సవసమితి తొలగించిన బారికేడ్లను మళ్లీ ఏర్పాటు చేయించారు. నిమజ్జనం కోసం అక్కడికి వచ్చిన భక్తులను మరో దగ్గరకు పంపించారు. కానీ, గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనతో ఎట్టకేలకు దిగొచ్చిన అధికారులు..ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతించి ఏర్పాట్లు చేశారు.

**గణేష్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం...**

ఈ నెల 17న జరిగే గణేష్ నిజమజ్జనోత్సవ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు జిహెచ్ఎంసి సర్వం సన్నద్ధమైంది. ఇప్పటికే అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. గతంలో ఎన్నికల ఇబ్బందులను పునరావృతం కాకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయి. ఇప్పటికే జిహెచ్ఎంసితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్‌లు, సామాచార, పౌర సంబంధాలు, పోలీసు శాఖ, రవాణా, హెచ్ఎండిఎ, వాటర్‌బోర్డు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఆర్టీసి, ఎస్‌పిడిసిఎల్, నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ, పర్యాటకతో పాటుమరికొన్ని విభాగాలతో పాటు 108 ఈఎంఆర్ఐ విభాగాల ఉన్నతాధికారుల సమన్వయంతో పనులు ఇప్పటికే పూర్తి చేశారు. నగరంలోని వివిధప్రాంతాలలో జిహెచ్ఎంసి జోన్‌లు, సర్కిళ్ల పరిధిల్లోనూ నిమజ్జనాలు జరిగే ప్రాంతాలవారీగా ఆయా విభాగాల అధికారులకు బాధ్యతలను అప్పగించారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాల సందర్భంగా వెలువడే వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేందుకు దారిపొడవునా దాదాపు కిలోమీటరుకు ఒక గ్రూపుచొప్పున పారిశుద్ధ్య కార్మికులతో గ్రూపులు ఏర్పాటు చేశారు. గణేష్ యాక్షన్ టీమ్స్ పేరుతో మూడు షిఫ్టుల్లో పనిచేయడం, ఒక్కో టీమ్‌లో ప్రాంతాన్ని, అవసరాన్ని బట్టి ఐదుగురు నుంచి పన్నెండు మంది వరకు కార్మికులుంటారు. దాదాపు మూడువేలమంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో పాల్గొన్నారు.

**ఇబ్బందులు అధిగమించేందుకు**

**ప్రత్యేక ఏర్పాట్లు : ఆమ్రపాలి**

శోభాయాత్ర, నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. ప్రశాంతంగా నిమజ్జనోత్సవ శోభాయాత్ర సందర్భంగా జరిగే కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు భక్తులు సహకరించాలని కోరారు. మండపాల నుంచి నిమజ్జనాలు జరిగే చెరువులు, కొలనుల దాకా భక్తులకు సమస్యలు లేకుండా రహదారి మరమ్మతులు, వీధిదీపాలు, చెట్లకొమ్మల తొలగింపు తదితర పనులకు పోలీసు, జిహెచ్ఎంసి అధికారులు, విద్యుత్తు సిబ్బంది, జీవవైవిధ్య విభాగం, ఇంజనీర్ల కమిటీగా ఏర్పడి మండపాల నిర్వాహకుల సూచనల మేరకు తగిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిహెచ్ఎంసి పరిధిలో ఎక్కడి ప్రజలు అక్కడే నిమజ్జనాలు చేసేందుకు వీలుగా 73 కొలనుల్లో నిమజ్జనాలకు ఏర్పాట్లుచేసినట్లు వివరించారు. వాటిలో జేబీ పాండ్స్, 24 పోర్టబుల్ పాండ్స్, 22 తాత్కాలిక కొలనులు, వీటితో పాటు 5 పెద్ద చెరువుల (సరూర్‌నగర్, జీడిమెట్ల, ఫాక్స్ సాగర్, బహదూర్ పుర, మీరాలంచెరువు, క్రాప్రా ఊర చెరువు) వద్ద ఏర్పాటు చేసినట్లు వివరించారు. 140 స్టాటిక్ క్రేన్‌లు, 295 మొబైల్ క్రేన్‌లు సిద్ధంగా ఉంచామని, ఆయా ప్రాంతాల్లో భోన సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. వీటితోపాటు నిమజ్జనోత్సవానికి అవసరమయ్యేందుకు రూ.12,77 కోట్లతో 309 మొబైల్ టాయ్‌లెట్లు, 52,270 వీధి దీపాలు, 172 రోడ్లమరమ్మతులు, ప్యాచ్‌వర్క్‌లు, రూ.16.35కోట్లతో రవాణాకు సంబంధించిన 36 పనులు అన్ని పూర్తి అయినట్లు చెబుతున్నా కొన్ని ప్రాంతాలల్లో రోడ్లన్ని గుంతలమయంగానే కనిపిస్తున్నాయి.

**నిమజ్జనోత్సవానికి 2500 వాహనాలు**

గణపతి నిమజ్జనోత్సవాలకు 2500 వాహనాలు ఆర్టీఏ సిద్ధంగా ఉంచారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి మండపాలకు అవసరమైన వాహనాలను అందించేందుకు రవాణా అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాలకుచెందిన మండపాల నిర్వాహకుల నుంచే వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా వాహనాలను ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కాగా సోమవారం వాహనాలను అందుబాటులోకి తేనున్నారు. కాగా నిమజ్జనోత్సవం జరిగే సమయంలో మండపాల నిర్వాహకులకు అందించేందుకు గ్రేటర్ పరిధిలో 12 కేంద్రాలను గుర్తించారు ఈ కేంద్రాల నుంచి మండపాలకు వాహనాలను తీసుకెళ్ళవచ్చు. నెక్లెస్ రోడ్డు, మేడ్చల్, టోలీచౌకి, జూపార్కు, మలక్‌పేట, కర్మన్‌ఘాట్, నాగోల్, గచ్చిభౌలి, మన్నెగూడ, పటాన్‌చెరు, వనస్థలిపురం, ఆటోనగర్ ప్రాంతాల నుంచి వాహనాలను మండపాలకు తరలించనున్నారు. మరోవైపు వాహనాలకు చెల్లించాల్సిన అద్దెలను ఆర్టీఏ అధికారులు ఖరారు చేశారు.

# ఎస్ఆర్‌నగర్‌లో కారు బీభత్సం

## షాపులోకి దూసుకెళ్లి కారు

**సంజీవరెడ్డినగర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఓ కారు అదుపుతప్పి భీభత్సం సృష్టించింది. ఒక షాపులోకి దూసుకువెళ్ళడంతో పలు వాహనాలు ద్వసం అయ్యాయి. ఎస్ఆర్‌నగర్ ఎన్స్‌పెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో టీఎస్ 08హెచ్‌జెడ్4143 నెంబర్ గల వాహనంను రవి అనే వ్యక్తి మద్యం సేవించి వాహనంని డ్రైవింగ్ చేస్తూ ప్యూర్ అండ్ నాచురల్ వెజిటెబుల్ షాపు దగ్గర మద్యం మత్తులో అదుపు తప్పి పార్కు చేసిన 3 ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేసుకుంటు షాపులోకి దూసుకెళ్ళింది. ఈమేరకు డ్రైవింగ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.




దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

# రాయదుర్గంలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైక్‌ను తప్పించబోయి కారును ఢీకొట్టిన ఆటో... మహిళ మృతి.. మరో నలుగురికి తీవ్ర గాయాలు



మ ృతిచెందిన రత్నాభాయి(ఫైల్‌ఫోటో)

**గచ్చిబౌలి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త**

ఐటి కారిడార్ పరిధిలోని రాయదుర్గంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అతివేగంగా వచ్చిన ఆటో ముందున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి పార్కు చేసి ఉంచిన కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఒక మహిళ మ ృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వీరితోపాటు మరో ఇద్దరు గాయపడగా, పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. రాయదుర్గం పోలీసుల కథనం ప్రకారం... చత్తీస్‌ఘడ్ రాష్ట్రం చంపాజాగీర్ సరాస్‌దోల్‌కు చెందిన రత్నాభాయ్(38), భర్త తులసీరామ్(48), కుమార్తె దుర్గేశ్వరీ(25)తో కలిసి నగరానికి వచ్చి ఫిలింనగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నివాసం ఉంటున్నారు. అందరూ రాయదుర్గంలోని పిడబ్ల్యుసిలో హౌజ్‌కీపింగ్ పనిచేస్తున్నారు. వీరంతా ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో రాయదుర్గంలోని పనిచేస్తున్న ప్రదేశానికి వచ్చేందుకు టోలిచౌకీలో రాజు అనే వ్యక్తి ఆటో ఎక్కారు. వీరితో పాటు ఆటోలో షేక్‌పేటకు చెందిన చంద్రకళ(15) సైతం ఉంది. ఉదయం పూట ట్రాఫిక్ రద్దీ లేకపోవడంతో ఆటో అతివేగం మీద ఉంది. రాయదుర్గంలోని మల్కం చెరువు సమీపంలోకి వచ్చిన తరువాత ఫ్లైఓవర్ మీద నుంచి ద్విచక్రవాహనం హోండా యాక్టివా మీద వస్తున్న మహ్మద్ షకీల్(56) ఆటో ఢీకొట్టింది. కాగా ద్విచక్రవాహనాన్ని తప్పించేందుకు ఆటో డ్రైవర్ చూడగా, మితిమీరిన వేగంతో ఉండడంతో అదుపుతప్పిన ఆటో పక్కనే పార్క్ చేసి ఉంచిన ఓ జైలో కారును ఢీకొట్టింది. మితిమీరిన వేగంతో ఉండడంతో కారును ఢీకొట్టిన అనంతరం ఆటో పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో రత్నాభాయ్, భర్త తులసీరామ్, కుమార్తె దుర్గేశ్వరీ, మరో ప్రయాణికురాలు చంద్రకళ, ద్విచక్రవాహనదారుడు మహ్మద్ షకీల్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, రత్నాభాయి మ ృతిచెందింది. తులసీరామ్, దుర్గేశ్వరీ, చంద్రకళ, మహ్మద్ షకీల్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు రాయదుర్గం పోలీసులు రత్నాభాయి మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.